క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి పూజలు



గురుపౌర్ణమి ఉత్సవాల్లో పాల్గొన్న దేవాదాయ శాఖాధికారి శ్రీనివాస్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): గురుపౌర్ణమి సందర్భంగా నగరంలోని పలు ఆలయాల్లో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయిబాబాకు విశేష అభిషేకాలు, అర్చనలు సాయి సత్యవ్రతాలు ఆచరించారు. బాబాకు ప్రత్యేక అలంకరణలు చేశారు. ఆయా ఆలయాల్లో స్వామి వార్లకు పంచామృత అభిషత్తకాలు చేసి అన్నసమారాధనలు ఏర్పాటుచేశారు. స్థానిక పాతబస్టాండు వద్ద ఉన్న శ్రీ పాండురంగ స్వామి దేవస్థానంలో గురుపౌర్ణమి పర్వదినం సందర్భంగా విశేష పూజలు చేశారు. ఉదయం గురు పాదుకా పూజ, కాకడ హారతి, విశేష అర్చన, శ్రీ షిర్డీ సాయినాథుని సత్యవ్రతాలు నిర్వహించారు. సాయి గురుదత్త హోమం, శ్రీ బాలా త్రిపుర సుందరి దేవి అమ్మవారికి అభిషేకాలు, విశేష కుంకుమార్చనలు చేశారు. మధ్యాహ్నం మహాపూర్ణాహుతి, తీర్థ ప్రసాద వినియోగం, అనంతరం భారీ అన్న సమారాధన నిర్వహించారు. సాయంత్రం పౌర్ణమి సందర్భంగా విశేష కుంకుమార్చన, జ్యోతిర్లింగార్చన, బాబాకు చావడి ఉత్సవం, దర్బారు సేవ, నీరాజన మంత్రపుష్పాలు, తీర్థ ప్రసాద వినియోగం చేశారు. ఈ ఉత్సవాల్లో జిల్లా దేవాదాయ శాఖాధికారి కూచిపూడి శ్రీనివాస్ పాల్గొని స్వామివార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అర్చకులు దండిభొట్ల కనక సుందర శర్మ ప్రత్యేక పూజలు చేయగా, కార్యనిర్వహణాధికారి సీహెచ్ చిన నాగేశ్వర రావు కార్యక్రమాలు పర్యవేక్షించారు.

సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌కు కొత్త మోటార్

ఏలూరు (టూటౌన్): దెందులూరు సమీపంలో ఉన్న సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌కు గోదావరి జలాలను పంపింగ్ చేసే 150 హెచ్‌పీ మోటర్‌ను బిగిస్తున్నామని నగరపాలక సంస్థ కోఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు, మున్సిపల్ ఎంఈ సురేంద్రబాబు తెలిపారు. గురువారం సాయంత్రం సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును వారు సందర్శించారు.

విజయరాజును కలిసిన నాయకులు

జంగారెడ్డిగూడెం: కూటమి ప్రభుత్వం అనుసరిస్తోన్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని వైఎస్సార్ సీపీ చింతలపూడి ఇన్‌చార్జి కంభం విజయరాజు అన్నారు. గురువారం విజయరాజును జంగారెడ్డిగూడెంలోని జెట్టి గురునాథరావు నివాసం వద్ద పార్టీ శ్రీనివాసపురం నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. వీరిలో సీనియర్ నాయకులు పాల్నాటి ప్రభాకర్, శ్రీనివాసరావు ఉన్నారు.

చరిత్రకు ఆనవాళ్లుగా థియేటర్లు

- టీవీలు, ఓటీటీల రాకతో ఆదరణ కరువు
- ఏలూరు నగరంలో 11 థియేటర్లు మూత
- షాపింగ్‌మాల్స్, అపార్టుమెంట్లుగా రూపాంతరం



శిథిలావస్థలో విశ్వశాంతి థియేటర్



ఖాళీ స్థలంగా దర్శనమిస్తున్న ఒకప్పటి శ్రీనివాస థియేటర్ ప్రాంతం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ప్రజల వినోదం కొత్త పుంతలు తొక్కుతోంది. ఒకప్పుడు వైభోగం అనుభవించిన రంగాలు మారుతున్న కాలంలో నిస్తేజంగా పడి ఉంటున్నాయి. దానికి సినిమా థియేటర్లు ప్రత్యక్ష ఉదాహరణగా చెప్పవచ్చు. రంగస్థల నాటకాలు రాజ్యమేలిన కాలం ఒకటుండేది. అప్పట్లో పౌరాణిక నాటకాలకు ప్రజల నుంచి విశేష ఆదరణ లభించేది. నాటకాలకు సైతం టిక్కెట్లు కొనుక్కుని చూసిన రోజులున్నాయంటే ఈ తరానికి ఆశ్చర్యంగా ఉంటుంది. ఈ రోజుల్లో నాటకాలు ప్రదర్శించినా ప్రేక్షకులు కరువవుతున్న పరిస్థితి ఎదురైంది. అనంతరం సినిమాలు రావడంతో ప్రేక్షకుల ప్రాధాన్యంలో మార్పు సంతరించుకుంది. తెరపై తమ అభిమాన తారలు ఆడిపాడుతుంటే ఒక వింతగా చూసి అబ్బుర పడిన సందర్భాలు ఉన్నాయి. అలా సినిమాలు దాదాపు మూడు దశాబ్దాల పాటు వినోదరంగంలో ఏకచత్రాధిపత్యం వహించాయి. కొత్త సినిమా రిలీజ్ అయిందంటే థియేటర్ల వద్ద పండుగ వాతావరణం కనిపించేది. ఒక్కొక్క సినిమా 100 రోజుల నుంచి ఏడాది పాటు ఆడిన సందర్భాలూ ఉండేవి. పౌరాణికాలు, జానపదాలు, సాంఘికాలు ఏ జోనర్‌లో సినిమా వచ్చినా ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణ లభించేది. 30 సంవత్సరాల క్రితం వరకు ఇదే పరిస్థితి కొనసాగింది. కొత్త సినిమాలు లేని సమయంలో పాత వాటినే మళ్లీ మళ్లీ ప్రదర్శించేవారు. ఎన్నిసార్లు చూసినా తిరిగి చూడడానికి ప్రేక్షకులు కూడా వచ్చే వారు దీంతో థియేటర్ల రాజ్యం కొనసాగింది.

థియేటర్ల వైపు చూడదని ప్రేక్షకులు

సాంకేతిక విప్లవం కారణంగా వినోదం నట్టింట్లోకి వచ్చేసింది. తొలుత టీవీలు ప్రజలను ఇళ్లకే పరిమితం చేయగా ఇప్పుడు ఓటీటీలు యువతను సైతం కట్టి పడేస్తున్నాయి. టీవీల రంగ ప్రవేశం, కేబుల్ టీవీల సాంకేతికత అందుబాటులోకి వచ్చిన తరువాత పాత సినిమాలు టీవీల్లో ప్రదర్శితవుతూ ఉండడంతో ఇక పాత సినిమాలను థియేటర్లలో చూడడానికి వచ్చే ప్రేక్షకుల సంఖ్య తగ్గిపోయింది. అనంతరం సినిమాల కోసమే ప్రత్యేక చానళ్లు అందుబాటులోకి రావడంతో ప్రతినిత్యం ఏదో ఒక పాత సినిమా అయినా ఇంటిలోనే చూసే అవకాశం రావడంతో థియేటర్లకు వాళ్లే ప్రేక్షకుల సంఖ్య గణనీయంగా తగ్గిపోతూ వచ్చింది. తాజాగా రెండు మూడేళ్లలో ఓటీటీలు నట్టింట్లో సందడి చేయడం ప్రారంభించడంతో థియేటర్ల మనుగడే ప్రశ్నార్థకంగా మారింది. కొత్తగా రిలీజైన పెద్ద హీరో సినిమా సైతం మూడు వారాలకే ఇంటిలో కూర్చుని చూసే సౌకర్యాన్ని ఓటీటీలు అందిస్తున్నాయి. ఒక ఫ్యామిలీ మొత్తం థియేటర్‌కు వెళితే ఒక్క సినిమాకే రూ.1000 ఖర్చు అవుతుంటే అదే ఖర్చుతో ఓటీటీలో ఏడాది పాటు పెద్ద హీరోలు, చిన్న హీరోలు అనే తేడా లేకుండా అందరు హీరోల కొత్త సినిమాలు చూసే అవకాశంతో పాటు ఇతర భాషల్లో పెద్ద హీరోల చిత్రాలు కూడా తెలుగు అనువాదాలతో ఓటీటీల్లో అందుబాటులోకి వస్తున్నాయి. ఈ కారణంగా సగటు ప్రేక్షకుడు థియేటర్లకు వెళ్లడాన్ని దాదాపు తగ్గించేసుకున్నాడు.

రూపు మారిన థియేటర్లు

ఇదిలా ఉండగా మూతపడిన థియేటర్లు రూపు మార్చుకుని ప్రజలకు దర్శనమిస్తున్నాయి. ఏలూరులో కొన్ని థియేటర్లు అపార్ట్‌మెంట్లుగా, మరికొన్ని థియేటర్లు షాపింగ్ మాల్స్‌గా మారాయి. కొన్ని థియేటర్లను కూల్చివేసి ఖాళీ స్థలాలుగా మిగిల్చారు. వీటిలో టూటౌన్‌లోని రామకృష్ణ థియేటర్, వెంకట్రామా థియేటర్ అపార్టుమెంట్లుగా మారగా వేదరాజ్ థియేటర్, శ్రీనివాస థియేటర్లు ఖాళీ స్థలాలుగా, రమా మహల్ షాపింగ్ మాల్‌గా మారిపోయింది. మిగిలిన విశ్వశాంతి థియేటర్ శిథిల దశకు చేరుకుని మెకానిక్ షెడ్‌గా ఉపయోగపడుతోంది. ఇక ఒన్‌టౌన్‌లోని కేసరి, కల్పన, గోపాలకృష్ణ థియేటర్లతో పాటు వెంకటేశ్వర థియేటర్ సైతం దుకాణాల సముదాయాలుగా రూపాంతరం చెందాయి. పాండురంగ థియేటర్ ఖాళీ స్థలంగా మారిపోయింది.

11 థియేటర్లు మూత

ఒకప్పుడు నగర ప్రజలను ఉర్రూతలూగించిన థియేటర్లు అనంతరం ఆదరణ కరువవడంతో మూసివేత దిశగా అడుగులు వేశాయి.ఏలూరు నగరంలో మొత్తం 11 థియేటర్లు మూతపడ్డాయి. ఏలూరులో టూటౌన్‌లో గతంలో 6 థియేటర్లు ఉండేవి. రామకృష్ణ, వేదరాజ్, విశ్వశాంతి, రమా మహల్, శ్రీనివాస, వెంకట్రామ థియేటర్లు ఇప్పుడు మూతపడ్డాయి. ఇక ఒన్‌టౌన్‌లో కేసరి, కల్పన, గోపాలకృష్ణ, వెంకటేశ్వర, పాండురంగ థియేటర్లు మూతపడ్డాయి. ప్రస్తుతం గతంలో ఉన్న అంబికా, బాలాజీ, సత్యనారాయణ, విజయలక్ష్మి థియేటర్లు మాత్రమే మనుగడలో ఉన్నాయి. వీటిని ఆయా యాజమాన్యాలు మినీ థియేటర్లుగా, ఒక్కో ప్రాంగణంలో మూడు థియేటర్లుగా మార్పు చేసి ప్రేక్షకాదరణ కోసం తంటాలు పడుతున్నాయి.

వైఎస్సార్ సీపీ నేత యేసురత్నం మృతి



యేసురత్నం మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న జేపీ



తేరా రఘు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న జేపీ

ఏలూరు టౌన్: ఏలూరు నగరానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు దవులూరి యేసురత్నం గురువారం మరణించారు. ఆయన మృతదేహం వద్ద వైఎస్సార్‌సీపీ ఏలూరు సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్ (జేపీ) పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుమారుడు దవులూరి రవి, కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు. వైఎస్సార్ సీపీ వారి కుటుంబానికి అండగా ఉంటుందని జేపీ తెలిపారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. పార్టీ ఏలూరు నగర అధ్యక్షులు గుడిదేశి శ్రీనివాసరావు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు నెరుసు చిరంజీవి, జిల్లా అధికార ప్రతినిధి మున్నుల జాన్‌గురునాథ్, ఎండీ కైసర్, భగవాన్, షమీమ్, బండ్లమూడి సునీల్‌కుమార్, మరియమ్మ, పదం రాము, వెంకటరత్నం, బల్ల రమేష్, నేతల కోటి సంతాపం తెలిపారు.

రఘు బలవన్మరణం

వైఎస్సార్ సీపీ ఏలూరు కార్యకర్త తేరా రఘు బలవన్మరణానికి పాల్పడ్డారు. కార్యకర్త మృతికి పార్టీ సమన్వయకర్త జయప్రకాష్ సంతాపం తెలిపారు. అతని కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీ ఎల్లప్పుడూ బాధిత కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పార్టీ నగర అధ్యక్షులు గుడిదేశి శ్రీనివాసరావు, పార్టీ ముఖ్యనేతలు రఘు మృతికి తమ సానుభూతి తెలిపారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం



పోస్టర్ విడుదల చేస్తున్న సైబర్ సెల్ సీఐ దాసు, ఎస్సై వల్లీపద్మ

ఏలూరు టౌన్: సైబర్‌నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఏలూరు సైబర్ సెల్ సీఐ ఎం దాసు, ఎస్సై వల్లీపద్మ అన్నారు. ఏలూరు అమీనాపేట సురేష్‌చంద్ర బహుగుణ పోలీస్ ఇంగ్లిష్ మీడియం స్కూల్లో విద్యార్థులు, తల్లిదండ్రులకు సైబర్‌నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సైబర్‌నేరాలు, ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కల్పిస్తూ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా సైబర్ సెల్ పోలీస్ అధికారులు మాట్లాడుతూ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావటంతో సైబర్‌నేరాలు పెరిగాయని, వాటిని సమర్థవంతంగా ఎదుర్కోవాలంటే ప్రజలు సైబర్‌నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, సోషల్ మీడియాతో ప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఫిషింగ్, లింక్ స్కామ్స్, ఫేక్‌కాల్స్ వంటివాటిని గుర్తిస్తూ వాటి బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ఇటీవల ఆన్‌లైన్ మోసాలకు గురయ్యేవారు ఎక్కువ అయ్యారని, సైబర్‌నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వాట్సాప్, టెలీగ్రామ్ ఇతర సోషల్ మీడియాల్లో ఇన్వెస్ట్‌మెంట్ చేయాలని వచ్చే ప్రకటనలను నమ్మవద్దన్నారు. ఎవరైనా సైబర్ నేరగాళ్ల బారిన పడి డబ్బు పోగొట్టుకున్నా, వేధింపులకు గురైనా వెంటనే 1930కు సమాచారం ఇస్తే వెంటనే చర్యలు తీసుకుంటామని సైబర్‌సెల్ సీఐ దాసు చెప్పారు. సదస్సులో ఈగల్ టీమ్ ఆర్ఎస్ఐ ఉదయ్‌భాస్కర్, ఆర్ఎస్ఐ నరేంద్ర, స్కూల్ ప్రధానోపాధ్యాయిని వి.స్రవంతి, వైస్ ప్రిన్సిపాల్ వరప్రసాద్, విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

సారా విక్రయిస్తే కఠిన చర్యలు

చింతలపూడి : స్థానిక ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్‌ను గురువారం ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఏలూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ కేఎస్ ప్రభు కుమార్ ఆకస్మిక తనిఖీ చేశారు. స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. నవోదయం 2.0 విజయవంతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. సారా రహిత జిల్లాగా మార్చడానికి గట్టి నిఘా పెట్టామన్నారు. సారా తయారు చేసినా విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నాగిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన ఇస్లావతు రాముపై పీడీ యాక్ట్ నమోదుకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు.

అమ్మ పేరుతో మొక్కను సంరక్షించాలి



మొక్కలు పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ నాయకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): అమ్మ పేరుతో ఒక మొక్క అంటూ లయన్స్ క్లబ్ ప్రతినిధులు విన్నూత్న కార్యక్రమం నిర్వహించారు. లయన్స్ క్లబ్ గ్లోబల్ లీడర్షిప్ చైర్ పర్సన్ వెల్లంకి సత్య స్వరూప్ ఆధ్వర్యంలో లయన్స్ సేవా యజ్ఞంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న పలు ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం నిర్వహించిన మెగా పేరెంట్, టీచర్ సమావేశాల సందర్భంగా ఏలూరు నుంచి చింతలపూడి మధ్య ప్రాంతాల్లోని వివిధ గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో 10 వేల మొక్కలను పంపిణీ చేశారు. ఏక్ పేడ్ మా కే నామ్ అంటూ విద్యార్థులకు మొక్కలను అందించారు. వాటిని నాటటమే కాకుండా విద్యార్థులు వారి తల్లి పేరున మొక్క సంరక్షణా బాధ్యత తీసుకోవాలని ప్రోత్సహించారు. ఆరు నెలల కాలంలో ఎవరైతే మొక్కని జాగ్రత్తగా చేసుకుంటారో వారికి తగిన బహుమతులు కూడా ఇస్తామని సత్య స్వరూప్ ప్రకటించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా పూర్వ గవర్నర్ వీకే పంకజాక్షన్, ఏపీ సేవా యజ్ఞం కోఆర్డినేటర్ చిల్లపల్లి రామ్మోహనరావు, కార్యక్రమ కో ఆర్డినేటర్ వడ్లపట్ల సాయి శరత్, లయన్స్ క్లబ్ రీజనల్ ఛైర్పర్సన్లు, జోనల్ స్థాయి నాయకులు పాల్గొన్నారు.

మెగా పేరెంట్స్ మీట్

దెందులూరు: ఏలూరు రూరల్ మండలం మానూరు ప్రాథమిక పాఠశాలలో గురువారం మెగా పేరెంట్స్ సమావేశం జరిగింది. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు హాజరయ్యారు. ముగ్గుల పోటీలు, లెమన్‌స్పూన్ ఆటలు ఆడించారు. తల్లిదండ్రులకు ప్రోత్సాహక బహుమతులు అందించారు. గుడివాకలంక మోడల్ ప్రైమరీ పాఠశాలలో మెగా పేరెంట్స్ సమావేశం జరిగింది. వివిధ రకాల పువ్వులతో అలంకరించి పండుగ వాతావరణాన్ని కల్పించారు. ప్రధానోపాధ్యాయులు నంబూరి రాంబాబు, గ్రామస్తులు, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	34	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	44	చిక్కుడు కాయలు	70
వంకాయలు (కాంతులు)	50	బీన్లచిక్కుడు	--
వంకాయలు (తెలుపు)	48	చామదుంపలు	36
బెండకాయలు	34	ములక్కాడలు	08, 10
పచ్చిమిర్చి	60	కంద	--
కాకర కాయలు	40-48	బీట్‌రూట్	38
బీరకాయలు	00	కీరా దోస	50
బీరకాయలు (పందిరి)	56	ఫ్రెంచ్‌బీన్స్	100
క్యాబేజీ	26	అల్లం	60
క్యారెట్	40	కొత్తిమీర (కట్ట)	20
దొండకాయలు	46	పాలకూర	12
బంగాళదుంపలు	30	తోటకూర	10
ఉల్లిపాయలు	28	చుక్కకూర	12
గోరుచిక్కుడు	48	గోంగూర	07-10
దోసకాయలు	20	పుదీనా	05
ఆనబకాయ (1)	10-15	క్యాప్సికమ్	90
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	40

గోవుల సంరక్షణకు ఆర్థిక సాయం



ప్రమాదంలో మృతి చెందిన గోవులను పరిశీలిస్తున్న తపన సంస్థ చైర్మన్

దెందులూరు: గోవుల సంరక్షణకు స్వచ్ఛంద సేవా సంస్థ తపన ఆర్థిక సాయం అందించారని సంస్థ చైర్మన్ గారపాటి సీతారామాంజనేయ చౌదరి అన్నారు. గురువారం ఆశ్రం వైద్యశాల మీదుగా వ్యాసగాని బ్రిడ్జి వద్ద జరిగిన ప్రమాదంలో మృతి చెందిన, గాయపడిన గోవులను ఆయన పరిశీలించారు. వీహెచ్‌పీ ప్రతినిధి శేఖర్ గోవులకు పూర్తి స్థాయిలో గోశాల లేదని తపన చౌదరి దృష్టికి తీసుకెళ్లారు. 10 ఎకరాల స్థలం గోశాల నిర్వహణకు తీసుకుంటే దానికయ్యే పూర్తి ఖర్చు తపన సంస్థ భరిస్తుందన్నారు. ప్రభుత్వం జాతీయ రహదారిపై చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలని ఆవుల రవాణాను శాశ్వతంగా నిరోధించేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. దెందులూరు ఎస్సై శివాజీ, పెదవేగి సీఐ రాజశేఖర్ మాట్లాడుతూ ఈ సంఘటనలో బాధ్యులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామన్నారు.

హానికారక పురుగుమందులు విక్రయిస్తే చర్యలు



పురుగుమందుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న జాయింట్ డైరెక్టర్ హబీబ్ బాషా

ఏలూరు (మెట్రో): పంటల్లో చీడపీడలు నివారణకు, గడ్డి నిర్మూలనకు విషపూరితమైన కలుపు మందులు, అనుమతులు లేని పురుగుమందులు విక్రయిస్తే సంబంధిత పురుగుమందుల దుకాణాలపై కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయశాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ హబీబ్ బాషా హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా పురుగుమందుల దుకాణాల్లో జరిపిన తనిఖీల్లో రాష్ట్రంలో నిషేధించబడిన గ్లెసైల్‌ను (కలుపుమందు) విక్రయిస్తున్నట్లు గుర్తించామని, ఇది అత్యంత విషతుల్యమైన పురుగుమందు అని చెప్పారు. ఈ మందు తెలంగాణ నుంచి అక్రమంగా దిగుమతి చేసుకుంటున్న వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గురువారం నిర్వహించిన తనిఖీల్లో ఏలూరులోని గ్రీన్‌సిటీలో ఉన్న పురుగుమందుల దుకాణంలో 200 లీటర్ల విలువైన గ్లెసైల్‌ను గుర్తించామని, దీని విలువ రూ. 1,78,500 ఉంటుందన్నారు. అదేవిధంగా అనుమతులు లేకుండా ఇతర పురుగుమందులు విక్రయిస్తున్నట్లు తమ తనిఖీల్లో నిర్ధారణ అయ్యిందని, రైతులు సైతం హానికరకమైన పురుగు మందులను ఉపయోగించరాదని జాయింట్ డైరెక్టర్ హబీబ్ బాషా సూచించారు.

దివ్యాంగులకు చేయూత

జంగారెడ్డిగూడెం: స్థానిక డాంగేనగర్ అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో వృద్ధులు, వికలాంగులకు వీల్‌ఛైర్, వాకింగ్ స్టాండ్, చేతి కర్రలను అందించారు. ఈ సందర్భంగా సంఘ వ్యవస్థాపకులు అమృతల రంగా మాట్లాడుతూ ఎన్టీఆర్ నగర్‌కు చెందిన గడ్డం రాంబాబు జ్ఞాపకార్థం అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో బాలాజీ నగర్ నివాసి శ్రీనివాసరావుకు వాకింగ్ స్టాండ్, ఎల్-4 కాలనీ నివాసి మల్లికార్జునరావుకు వీల్ ఛైర్, చేతికర్రలను అందించామన్నారు. గెడ్డం రాంబాబుకు మృతి చెందడంతో గతంలో రోటరీ క్లబ్ ద్వారా ఆయనకు అందించిన వీల్‌ఛైర్‌ను మరో వికలాంగ యువకుడు మల్లికార్జునకు అందించినట్టు చెప్పారు. సహకారం అందిస్తున్న దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంఘ గౌరవ అధ్యక్షులు నేలపోలు ప్రభాకర్‌రావు, అధ్యక్ష కార్యదర్శులు కె.లక్ష్మణరావు, పఠాన్ బాజీ, ఉపాధ్యక్షులు ఎల్ శ్రీనివాస్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	27
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	37
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	38
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	14
ఏలూరు - అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో 22సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	27
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.15	4822	31
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	27
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	24
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	28
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	31
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	31
ఏలూరు - తిరుపతి	16.00	4830	34

సర్వసభ్య సమావేశానికి అధికారుల డుమ్మా

పెదపాడు: మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి మండల స్థాయి అధికారులు కొంతమంది గైర్హాజరు కావడంతో ఎంపీడీవోపై ఉమ్మడి జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ మండిపడ్డారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ఒకరిద్దరు మండల స్థాయి అధికారులు మినహా మిగతా వారంతా సమావేశ మందిరంలో లేకపోవడంతో ఎంపీడీవోను ప్రశ్నించారు. వారు చెప్పాల్సిన సమాధానాలు మీరు చెబుతారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిని వివరించారు. సమావేశానికి రానివారికి, సమావేశానికి వచ్చినట్లు రికార్డుల్లో సంతకాలు చేసిన వారికి నోటీసు ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం ఎంపీపీ బత్తుల రత్నకుమారి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. మండల ఉపాధ్యక్షుడు రెడ్డి స్వర్ణకుమారి, అప్పన పద్మావతి, పాతముప్పర్రు గ్రామ సర్పంచ్ మెడబలిమి స్వరూపరాణి సంతోష్‌కుమార్ వివిధ గ్రామాల సర్పంచ్‌లు ఎంపీటీసీలు ఈఓఆర్డీ సూర్యకుమార్, డాక్టర్ పాల్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఆదర్శ ఉపాధ్యాయులు

- ప్రభుత్వ పాఠశాలలో తమ పిల్లలను చదివిస్తున్న వైనం
- స్ఫూర్తిగా నిలిచిన కొయ్యలగూడెంలోని ప్రభుత్వ ఉపాధ్యాయులు

కొయ్యలగూడెం: వారంతా ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు. తమ పిల్లలను పనిచేస్తున్న పాఠశాల్లోనే చదివిస్తూ స్ఫూర్తిదాయకంగా నిలిచారు. ప్రభుత్వ పాఠశాలలోనే తాము విద్య నేర్చుకొని ఉపాధ్యాయులుగా స్థిరపడ్డామని చెబుతున్నారు. ఆ వివరాలిలా ఉన్నాయి. పరింపూడి బాలికోన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు గజ్జల సరస్వతి తన కుమార్తె సౌజన్యను పదో తరగతి అదే పాఠశాలలో చదివిస్తున్నారు. కొయ్యలగూడెం బాలుర ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడు చింతపల్లి ఏసయ్య తన ఇద్దరి కుమార్తెలు నిహారిక, (ఆరో తరగతి, బాలికల హైస్కూల్), ప్రజ్వల (నాలుగో తరగతి ఎంపీపీ స్కూల్)ల్లో చదివిస్తున్నారు. బాలికల హైస్కూల్లో ఉపాధ్యాయురాలు కుంజం వసంత విజయ తన కుమార్తె శార్వాణిని అదే స్కూల్లో ఏడో తరగతి చదివిస్తున్నారు. సరిపల్లి ఎంపీపీ స్కూల్ ఉపాధ్యాయురాలు ధనలక్ష్మి అదే పాఠశాలలో తన కుమారుడు జి.సాయిశరణ్‌ను నాలుగో తరగతి చదివిస్తున్నారు. నరసన్న పాలెం ఎంపీపీ స్కూల్లో ఉపాధ్యాయుడు కటారి రాంబాబు తన కుమారుడు వేదార్ష సాహిత్‌ను మూడో తరగతి చదివిస్తున్నారు. పరింపూడి బాలికల హైస్కూల్‌కి చెందిన విద్యార్థి తోట భార్గవి లక్ష్మీ దుర్గ గత పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా మార్కులు సాధించి మండల ప్రథమ స్థానంలో నిలిచారు. అత్యుత్తమ ర్యాంకు సాధించడం గర్వకారణంగా నిలిచింది అని బాలికల హైస్కూల్ ఉపాధ్యాయులు పేర్కొన్నారు. ఈ ఆదర్శ ఉపాధ్యాయులను పలువురు అభినందిస్తున్నారు. ఇతర ప్రభుత్వ ఉద్యోగులు కూడా తమ పిల్లలను గవర్నమెంట్ స్కూళ్లలో చదివించడానికి ముందుకొస్తే ఆ విద్యాసంస్థలపై మరింత నమ్మకం ఏర్పడుతుందని పేర్కొంటున్నారు.